49.

# శరీర మాద్యం ఖలు ధర్మ సాధనం

పునర్విత్తం పునర్మిత్రం పునర్భార్యా పునర్మహీః
ఏతత్సర్వం పునర్లభ్యం నః శరీరం పునఃపునః

ప్రేమస్వరూపులారా!

**ఈ శరీరము ధర్మాచరణ నిమిత్తమై భగవంతుడు అందించిన వరప్రసాదము:**

ధనమును కోల్పోయిన ఏదో ఒక యుక్తిచేత లేక ఏదో ఒక శక్తిచేత ధనమును తిరిగి సంపాయించుకొనవచ్చు. మిత్రుని కోల్పోతివా తిరిగి ఏమంచి భావము చేతనైనా ఏ సత్సంకల్పముల చేతనైనా అనేకమంది మిత్రులను సంపాయించుకొనగలము. భార్యను కోల్పోయిన, తిరిగి రెండవ వివాహమాడి సతిని పొందవచ్చును. భూమిని కోల్పోయిన తిరిగి సంపాయించుకొనుటకు ఎంతైనా అవకాశము ఉన్నాది. కానీ, శరీరమునే మనం కోల్పోయిన తిరిగి మనకు లభ్యము కాదు. కనుక, 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనం' అనగా ఈ శరీరము ధర్మాచరణ నిమిత్తమై భగవంతుడు అందించిన వరప్రసాదము. ఈ పవిత్రమైన శరీరమును పవిత్రమైన మార్గమందు, పవిత్రమైన కర్మలచేత, పవిత్రము గావించుకోవాలి. శరీరమునకు ఆరోగ్యము అత్యవసరము. మానవ జీవితమునకు ఆరోగ్యమే ఒక పునాదివంటిది. కనుక ఆరోగ్యమును కోల్పోయిన అనేక బాధలకు గురి కావలసి వస్తుంది. మానవజీవితములో ఆరోగ్యము కంటె మించిన మహాభాగ్యము మరొకటి లేదు. ఈ ఆరోగ్యము అనే పదము ఎక్కడనుండి ప్రారంభమైంది. ఆంగ్లోసీకన్ నుంచి వచ్చింది. ఈ పదమునకు ఆధారము మరొక పదము helath. హెలిత్ అనగా పవిత్రము అని ఒక అర్థము, ఆరోగ్యము ఆనందకరమని మరొక అర్థము. పవిత్రమైన, పరిశుద్ధమైన మానవతత్త్వమే ఈ హెలిత్ కు అర్థము. దేహమనగా కేవలం ఒక తల అని కానీ, చేతులని గానీ లేక ముక్కు అని కానీ, చెవి అని గానీ, పాదములని గానీ ప్రత్యేకించినది కాదు. అన్ని అంగముల చేరికయే ఈ శరీరము.

sri sathyasai vachanamrutam

## ఆరోగ్యమైన దేహమందే ఆరోగ్యమైన మనస్సు కూడా ఉంటుంది

పరిపూర్ణమైన ఈ శరీరతత్వాన్ని పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టాలి. ప్రతి అంగమును పవిత్రమైన కార్యములో ప్రవేశపెట్టాలి. అప్పుడే ఈ శరీరము పుష్టిని, సంతుష్టిని అందుకుంటుంది. శరీరము ఆరోగ్యముగా లేకుండిన మనసు యిందులో ఆరోగ్యముగా ఉండదు. ఆరోగ్యమైన దేహమందే ఆరోగ్యమైన మనస్సు కూడా ఉంటుంది. ఆరోగ్యమైన శరీర, మనస్సుల యొక్క పరిస్థితిని పురస్కరించుకొనియే ఆత్మ వ్యక్తిత్వమును పోషిస్తూ ఉంటుంది. మానవుని శరీరము సర్వధర్మములకు, సర్వకర్మలకు మూలాధారమైనది. "ధర్మార్థ కామ మోక్షానాం ఆరోగ్యం మూలముత్తమం" అనగా ధర్మార్థకామమోక్షములనే ఈ పురుషార్థములకు ఆరోగ్యమే ప్రధానమైన పునాది. కనుక ఆధ్యాత్మికము, నైతికము, ధార్మికము, లౌకికము యిత్యాది మార్గములలో ఈ శరీరమును నియమించే ముందుగా ఆరోగ్యమును కాపాడుకోవాలి. ఈ ఆరోగ్యము చెడటానికి మూల కారణం విచారించాలి. అమితమైన ఆలోచనల చేతను, అమితమైన చింతల చేతను, అమితమైన చదువుల చేతను ఆరోగ్యమును కోల్పోతున్నారు. కొంతమంది పిల్లలు నిరంతరం చదవటానికి పూనుకుంటారు. అధికంగా చదువుతే అనారోగ్యం చేకూరుతుంది. ప్రతిదానికి ఒక నియమం ఉంటున్నది. ప్రతి కర్మకు ఒక పరిమితముంటున్నది. గ్రీసు దేశస్థుడైన వేదాంతి అరిస్టాటిల్ ఒక విధమైన ఆదర్శమును నిరూపిస్తూ వచ్చాడు. ప్రతివ్యక్తి జీర్ణకోశము యొక్క పరిశోధనలు చేస్తూ వచ్చాడు. నిరంతరము అమితమైన విచారణ చేయటం చేత, పరిశోధనలు సల్పటం చేత కట్టకడపటికి అతనికి కూడా అనారోగ్యము ఏర్పడి అజీర్ణవ్యాధికి గురై మరణించాడు. అదేవిధముగనే హెగ్ అనే డాక్టరు గుండె (heart) జబ్బులకు అనేక పరిశోధనలు చేస్తూ వచ్చాడు. ఈ గుండె సంబంధమైన జబ్బులను నిరంతరం పరిశోధనలు చేయటం వలన కట్టకడపటికి హార్టు పేషెంటుగా రూపొంది, ప్రాణం వదిలాడు. ఏ పనియందైనా ఏ అనారోగ్యము నందైనా కూడను ఏ విషయమందైనా అమితంగా మనం విచారణ చేయరాదు. శరీరము ఒక పరిమితమైన స్థితి ఏర్పడినది. ఈ పరిమితమైన దేహమునకు పరిమితమైన శక్తియే ఉపయోగించాలి. పరిమితమైన పనులు చేసి పరిమితమైన ఆనందము పొందాలి.

**జీవనోపాధి కొరకు ఉపయోగించే విద్యలు ప్రవృత్తి లక్షణము, జీవిత పరమార్థమునకు ఉపయోగించే విద్యలు నివృత్తి లక్షణమును కలిగియున్నవి:**

ఈనాడు మనం మానవతా విలువలని అనేక విధములుగా విద్యార్థులకు బోధిస్తున్నాము. దానితో పాటు ఆ పిల్లల యొక్క స్థితి గతులు మనం కొంతవరకు విచారించి వారికి బోధించటానికి ప్రయత్నం చేయాలి. బలహీనులైన బిడ్డలకు బలమైన విషయాలు అమితంగా తలలో చేర్చటానికి పూనుకోకూడదు. మొట్టమొదట బలహీనమైన బిడ్డలను బలవంతులుగా చేయటానికి కొన్ని ప్రయత్నములు చేయాలి. శారీరకంగా, మానసికంగా ఏవిధమైన బలహీనతకు గురౌతున్నారో చక్కగా విచారణ చేయాలి. ఆ పిల్లలకు మొట్టమొదట బోధించవలసింది health is wealth. ఆరోగ్యమే మహాభాగ్యమని వారికి బోధించాలి. వారి ఆరోగ్యమును సరియైన మార్గములో నుంచుటకు తగిన కృషి చేయాలి. తదుపరియే ఈ విద్యావిధానాన్ని వారియందు ప్రవేశపెట్టాలి. సంస్కృత భాషలోని 'విత్' అనే పదము నుండి 'విద్య' ఏర్పడింది. 'విత్' అనగా జ్ఞానమని అర్థము. 'విత్' అనగా ప్రకాశము అని కూడా అర్థము. 'విత్' అనగా ఆనందము అని మరొక అర్థము కూడా ఉంది. ప్రకాశవంతమైన, పవిత్రమైన, విశాలమైన, భావమునకే 'విత్' అని పేరు. ఈ 'విత్' అనే పదమునకు ఆంగ్లములో education అన్నారు. "Education" అనే పదము ఎక్కడ నుండి వచ్చింది? 'Educare' అనే పదము నుండి వచ్చింది. ఎడ్యూకేర్ అనగా ఏమిటి? బయటకు తీయటమని దీని అర్థము. ఏవిధంగా తీయటము? గోచరమయ్యే ప్రపంచము నుండి అగోచరముగానున్న వాటిని గోచరింపచేయటము, బయటకు తీయటము. అంతర్ముఖముగానుండిన విషయములను బహిర్ముఖముగావించటము, బయటకు తీయటము. Educare అనే పదమునకు రెండర్థములున్నాయి. తన తల నుంచి తీయవలసింది ఒకటి, హృదయమునుండి తీయవలసింది రెండవది. చదవటము, వ్రాయటము, ఉద్యోగాలు చేయటము, సంపాదనలు సల్పటం, ఆనందము అనుభవించటం యివన్నీ కేవలం తన తల నుంచి వచ్చేవే. ఇవి కేవలము జీవనోపాధి నిమిత్తమై ఏర్పడినవే. ఇవి కూడను మానవునకు అవసరమే. అయితే రెండవది హృదయమునుండి వచ్చేది. ఈ హృదయము నుండి ఆవిర్భవించేవి ఏమిటి? అవి శాశ్వతంగా అక్కడ ఉన్నవే. అవే దయ,

sri sathyasaivachanamrutam

ప్రేమ, సహనము, సానుభూతి, సత్యము యిత్యాది పవిత్రమైన గుణములు. ఇవి జీవిత పరమావధి నిమిత్తమై ఏర్పడినవి. జీవనోపాధి ఒకటి, జీవిత పరమావధి రెండవది. మొదటిది ప్రవృత్తి లక్షణము. రెండవది నివృత్తి లక్షణము. మొదటిది నెగిటివ్ తత్వము. రెండవది పాజిటివ్ యొక్క శక్తి. దయ, ప్రేమ చదవటం వల్ల వచ్చేవి కాదు. ప్రేమ, సత్యము, ఓర్పు పుస్తకముల నుండి ప్రవేశించేవి కావు. మన హృదయమందు సహజంగానే ఉంటున్నాయి. ఇవన్నీ సహజ తత్వములు. కనుక సహజమైన వాటిలో ఉపాయము చేత వీటిని బయటకు తెప్పించాలి. Educare అనే పదమునకు ఇదే అర్థము. వెలుపలికి తీయటము. ఈవిధంగా తనయందున్న వాటిని హృదయమునందున్న వాటిని వెలుపలకు తీసి, వెలుపలకు తీసిన వాటిని శరీరముతో అనుభవించాలి. తలనుండి వచ్చినవన్నీ తాత్కాలికమైనవే. ఇవి శాశ్వతమైనవి కాదు. ఇవి లోకసంబంధమైన గుణములే. లోక ప్రతిభ నిమిత్తమై అనుభవించటానికి ఇవి అత్యవసరమే. ఇవి ప్రవృత్తి మార్గములే. జీవనోపాధి నిమిత్తమై ఏర్పడినవే కానీ దయ, ధర్మము, న్యాయము, ప్రేమ, సత్యము, ఇవన్నీ జీవనోపాధి నిమిత్తము కాకుండా జీవిత పరమావధి నిమిత్తమై ఏర్పడినవి.

**తలనుండి వచ్చేవి ప్రకృతి విలువలు, హృదయమునుండి వచ్చేవి మానవతా విలువలు**

హృదయమునకు compassion అని పేరు పెట్టారు. హృత్+దయ అదియే హృదయం. ఆ హృదయమునకు 'కరుణ' అని పేరు. ఈ రెండింటిని మనము సక్రమమైన మార్గములో అనుభవించినప్పుడే మనము శరీరమునకు సరైన ఆరోగ్యమును చేకూర్చిన వారమవుతాము. ఈనాడు మానవతా విలువలు ఇలాంటివే. మనకు కనుపించని సత్యములు మనయందు ఎన్నియో ఉంటున్నవి. అయితే కనిపించేవి, వినిపించేవి, తలపించేవి, మురిపించేవి వాటికే మనం మోజులు పడుతున్నాం. కనిపించని వాటిని మనం ఏమాత్రం చింతించటం లేదు. కనుక, **'కనుపించనిదే వినిపించును మన కర్మల ఫలముల మర్మము జీవా'** అన్నారు. ఆ కనిపించనివి మనను ఇన్ని కష్టాలకు గురిచేస్తున్నాయి. అదియే అజ్ఞాతశక్తులు అన్నారు. అజ్ఞాతశక్తులనగా ఏమిటి? పాండవులు అజ్ఞాతవాసము చేశారు 14 సంవత్సరములు. ఆ సమయములో పాండవులు ఉన్నారు. కానీ ఎవరికి తెలియకుండా బ్రతుకుతూ వచ్చారు. అదేవిధముగా ఈ పవిత్రమైన భావములు మన



sri sathyasai vahamrutam

హృదయమందున్నవి. కానీ వాటిని తెలుసుకొనలేక మన యందు లేదు, బయటనుంచి మనం నేర్చుకుంటున్నాం అని భావిస్తున్నాము. ఇది ఎవ్వరూ అందించేవి కాదు. గురువు బోధించేది కాదు. గ్రంథములు అందించేవి కాదు. కేవలం మన హృదయము నుండియే ఆవిర్భవించేవి. అవియే నిజమైన మానవతావిలువలు. తలనుండి వచ్చేవన్నీ ప్రకృతివిలువలు. కనుక ప్రకృతి విలువలు వేరు, పరతత్త్వవిలువలు వేరు. ఆ పరతత్త్వవిలువలే human qualities అన్నారు. అవి ఈనాడు మనం కోల్పోయినాం. ఈనాడు human being man గా కనిపిస్తున్నాడేగానీ వానియందు humanity లేదు. ఆకారమానవుడుగా కనిపిస్తున్నాడు గానీ ఆచరణ మానవుడుగా కనిపించటం లేదు. ఈనాడు వాటిని బయటకు తెప్పించుకొని, ఆచరణలో పెట్టి, మనకు కనిపించే ఆనందమును అనుభవించాలి. ఆరోగ్యమునకు యిదెంతయో ప్రోత్సాహమునందిస్తుంది. ఆరోగ్యమును కాపాడుకొన్నప్పుడు మానవతావిలువలను ఎంతైనా పోషించవచ్చు.

## Human values లో మొట్టమొదట బోధించవలసినది ఐకమత్యము

దేహములో ఏ ఒక్క అంగము ప్రధానమైనది కాదు. అన్ని అంగముల ఏకత్వమే శరీరమైపోయింది. ఏ అంగమును దేహమని అనుటకు వీలుకాదు. అన్ని అంగముల యందు ఐకమత్యము అత్యవసరం. ఈ human values లో మొట్టమొదట బోధించవలసింది ఐకమత్యము. యిదే నిజమైన యూనిటీ. ఐకమత్యము లేనప్పుడు యింక పవిత్రత ఎట్లా వస్తుంది? ఎవరినైనా మొట్టమొదట పలకరించినప్పుడు హల్లో అని కాకుండా brother, brother అని సంబంధ బాంధవ్యము పెంచుకుంటూ రావాలి. అందరు ఒక తండ్రిబిడ్డలే. కనుక brotherhood of man, fatherhood of God అనే దాన్ని మొట్టమొదట బోధించాలి. అందరు భగవంతుని బిడ్డలే. ఒక్కొక్కరికి ఒక్కొక్క రూపము, ఒక్కొక్క దేశము, ఒక్కొక్క భాష ఉంటున్నది. వేషభాషలను, దేశమును పురస్కరించుకొని వారిని పరాయివారుగా మనం భావించరాదు. ఈ పరాయి వారుగా భావించటం చేత మనకు ఈ పరతత్త్వము అర్థం కావటం లేదు. పరాయి వారు కానేకాదు. అందరు ఏక కుటుంబీకులే. ప్రతి వ్యక్తి విశ్వకుటుంబములో ఒక మెంబరే. ఆ సత్యాన్ని మొట్టమొదట గుర్తించి పిల్లలకు బోధించాలి. పిల్లలకు బోధించేటప్పుడు మీరు నడుచుకొని దాన్ని చూపించాలి. మొట్టమొదట

sri sathyasai vahini amrutam

be good, రెండవది do good, మూడవది see good, నాల్గవది talk good. కానీ నీలో లేవు అవి.

**ఆచరణ ప్రధానం**

అందరికి సత్య, ధర్మ, శాంతి, ప్రేమలని బోధిస్తున్నారు. ఈ బోధించే దానికంటే ఆచరించటం గొప్ప ప్రచారమవుతుంది. పిల్లలు ఈనాటి కాలములో మహా తెలివితేటలు కల్గినవారు. ఈనాటి కలియుగ ప్రభావము చేత, ఆధునిక విద్యలు సులభంగా ఎన్నైనా నేర్చుకోగలుగుతున్నారు. కానీ ఆధ్యాత్మిక విషయములో నేర్పే గురువును అనుసరిస్తున్నారు. మొట్టమొదట పిల్లలకు బోధించే ముందుగా ఆచరించి బోధించామంటే తప్పక పిల్లలు కూడా ఆచరిస్తారు. పిల్లలు చాలా తెలివితో చూస్తూ ఉంటారు, వింటూ ఉంటారు. అదే మా అధ్యాపకుడు మాకు చెబుతున్నాడు. అధ్యాపకుడు చేస్తున్నాడా? అని గమనిస్తారు. నిజంగా అవి ఉత్తమ పదములే అయితే, ఉత్తమ మార్గములే అయితే తాను ఎందుకు చేయదికూడదు అనే సందేహాలు బయలుదేరుతాయి. తాను ఆచరించనప్పుడు మాకు ఆచరించమని చెప్పటానికి అధికారము ఏముంటుంది? అని వారిలో వారు ప్రశ్నించుకుంటారు. కనుక, మొట్టమొదట ఒకటి రెండైనా ఆచరించి వారికి బోధించటానికి ప్రయత్నించాలి. అప్పుడే పిల్లలకు సరైన విద్యలు అందించిన వారమౌతాము. ఇతనికి ఆచార్యుడని పేరు పెట్టారు. ఆచార్య అంటే అర్థము ఏమిటి? ఆచరించి బోధించిన వాడు ఆచార్యుడు. కాబట్టి ఈనాడు ఆచార్య అనే పేరుకు విలువయే లేదు. ఎందుకంటే కేవలం గ్రంథ పరిచయముతో బోధిస్తున్నారు. కనుకనే ఆశించిన ఫలితమును త్వరలో చూడలేకపోతున్నారు. ఈనాటి నుండి విదేశీయులుగానీ, ఏ దేశీయులైనా అందరు ఒక్క తల్లిబిడ్డలమనే భావమును ఏకత్వాన్ని భావించి, అనేకత్వములో అనేకత్వము అనుభవిస్తూ రావాలి.

మొట్టమొదట మనం ఐకమత్యాన్ని సాధించాలి. ఐకమత్యము లేకపోవటం చేత ఏదేశమైనా, ఏ సమాజమైనా, ఏకులమైనా, ఏమతమైనా ఛిన్నాభిన్నంగా మారిపోతున్నాయి. ఈ విపరీతమైన భేదములకు అనైక్యతే మూలకారణము. మొట్టమొదట ఐకమత్యమును ఒక ప్రత్యేకమైన మార్గములో అనుభవించాలి. సాయికి ఏదేశముల వారైనా, ఏ మతమువారైనా,

sri sathyasai vachanamrutam

ఏ వయస్సు వారైనా, ఏ భాషవారైనా సమానమే. ఏవిధంగా వారిని సాయి చూచుకుంటున్నాడో దానినే మీరు కూడా అనుభవించాలి. కనుక Follow the master. నీ master ని నీవు follow చేయి. నీ master అందరిని సమభావంతో చూస్తున్నప్పుడు నీవు ఎందుకు చూడకూడదు? ఇక్కడ ఏమాత్రం భేదము ఉండకూడదు. ఐకమత్యమును మనం పెంచుకున్నప్పుడే నిజమైన స్వాతంత్ర్యము సాధించిన వారమవుతాం. ఈ స్వాతంత్ర్యము వచ్చినప్పుడే పరతంత్రాన్ని మనం అనుభవిస్తాము. కనుక, దివ్యత్వమైన మానవతా విలువలు మనం పెంచు కోవాలనుకుంటే మొట్టమొదట ఐకమత్యాన్ని పెంచుకోవాలి.

ఈ ఐకమత్యములో కొన్ని రకములైన భేదములు ఏర్పడుతున్నాయి. మానసికంగా కొన్ని భేదములు కలుగవచ్చు. ఇవి మూడు విధములుగా వస్తున్నాయి. మానవునికి అనారోగ్యము కల్గటానికి ఈ సైకలాజికల్ భావములే మూలకారణం. ఈ సైకలాజికల్ అంటే ఏమిటి? కేవలం భ్రమించటం. ఇతరులకున్నవి నాయందున్నవో లేవో అనే అనుమానము వల్ల అతనికి కూడా ఆ రోగము ప్రారంభమవుతుంది. ప్రాచీన కాలమందు ఏవైనా కొన్ని రోగములు వస్తే ఆ స్థానమునకు మాత్రమే పరిమితంగా ఉండేవి. కానీ ఆధునిక యుగము ప్రారంభమైన తరువాత క్రమక్రమేణా సర్వవ్యాపకముగా ప్రాకిపోతున్నాది. కారణం అక్కడకు వచ్చిన వారికి నాకు వస్తుందో ఏమో అనే భయమే కారణం. ప్రతి మానవునికి రోగములు అభివృద్ధి రావటానికి కారణం ఈ సైకలాజికలే. 80% రోగాలు సైకాలజికలే కారణం. నీవు నీ పల్ను సరిగా ఉందా అనే అనుమానంతో చూసుకో, ఎక్కువైనా ఉంటుంది, తక్కువైనా ఉంటుంది. నీవు దానిపై చింతనే పెట్టుకోవద్దు. నీవు ఆనందంగా నీ కర్తవ్యము నిర్వర్తించుకుంటూ రా. అది సక్రమమైన మార్గమును అనుసరిస్తుంది.

**మనం computer గా కాదు, composer గా మారాలి**

భగవత్ సృష్టిలోపల ప్రతికర్మ ఒక నియమబద్ధమైనదే. సూర్యోదయము, సూర్యాస్తమయములు ఒక నియమమును అనుసరించేవే. సూర్యోదయ, సూర్యాస్తమయములు దైవనిర్ణయమును అనుసరిస్తూ దైవనియమాన్ని అనుసరిస్తూ, దైవ ప్రభావాన్ని అనుసరిస్తూ నడుస్తుంటే మానవుడైన వాడు తెలివితేటలు కలిగి కూడను

sri sathyasai vahini vachanamrutam

అనుభవించటానికి వీలు కావడం లేదు. ఎందువలన? మానవుడు ఈనాడు లౌకికమైన ప్రజ్ఞాశక్తిని అందుకోవాలని ప్రయత్నం చేస్తున్నాడు. ఈ ప్రజ్ఞానశక్తి ఎక్కడ నుండి వస్తుంది? ప్రాకృతమైన, లౌకికమైన ప్రజ్ఞాశక్తికి మార్గం ఏమిటి? ఈ ప్రజ్ఞానశక్తి మానవునికి కేవలం ఒక మిషనుగా మార్చి వేస్తున్నది. మిషనుగా మార్చటం వలన వాడు గొప్ప ప్రజ్ఞానశక్తిగల వాడుగా భావిస్తున్నాం. ఈ ప్రజ్ఞానశక్తిని information oriented knowledge అంటారు. కానీ ఈ knowledge కాదు ముఖ్యము. Information కాదు ముఖ్యము. నిజమైన మానవతా విలువలు రావాలంటే transformation కావాలి. ఈ Information knowledge మానవుని కేవలం ఒక computer గా మార్చివేస్తున్నాది. కానీ computer గా మారినందు వలన ప్రయోజనం లేదు. Composer గా మారాలి మనము. అదియే human value. ఈ composer లేక computer ఏమి చేస్తుంది? మానవతా విలువలు మానవుని composer గా మారుస్తాయి. కానీ భౌతిక శక్తులన్నీ కేవలం computer గా మార్చివేస్తున్నాయి. ఈనాడు ప్రతిమానవుడు computer అంటే చాలా like చేస్తున్నాడు. దీనివల్ల కలిగే ఫలితము ఏమిటి? కడపటికి మన తెలివితేటలు మనం మర్చిపోతున్నాం. మన నిజమైన computer యిక్కడుంటున్నాది (హృదయములో). దగ్గరనున్న computer ను మర్చిపోయి డబ్బిచ్చి కొనుక్కొని దానితో మన కార్య కలాపములను నిర్వర్తించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు. యింత కంటె అమాయకత్వం మరొకటుందా? రెండు షర్టులు, రెండు ప్యాంటులు, నాల్గు కర్చీఫులు తీసుకుంటే క్యాలుకులేటర్ ఒత్తి దాని వెల చూస్తున్నారు. భగవంతుడు ఇచ్చిన శక్తిని, తలను ఉపయోగపెట్టుకోటం లేదు. Original computer మన దగ్గర ఉంటున్నాది. దాన్ని మనం follow చేయాలి. కానీ ఈనాడు original ను విడిచిపెట్టి artificial ని follow చేస్తున్నారు. Art is outside and heart is inside. Art ను ఆశిస్తున్నారు గానీ heart ను ఆశించటం లేదు. మనము heart ను follow చేస్తే art అంతా దానినుంచే వస్తుంది. Art comes from the heart. ఈ సత్యమును గుర్తించటానికి ప్రయత్నం చేయాలి. ఈనాడు విద్యావిధానములో ఎంతైనా మార్పు చేయవలసింది ఉంది. బాలవికాస్ మార్గమందు టీచర్సు యిలాంటివన్నీ చక్కగా కనిపెట్టి పిల్లల ద్వారా ప్రపంచానికి మనం వ్యాప్తి గావించాలి. మీరు వేరుగా భావించకూడదు. అనేకమంది పురుషులు ఇందులో

sri sathyasai vahinamrutam

పాల్గొనటం లేదు. ఒక చిన్న ఉదాహరణ చాలు. నేను Chairman అనుకుంటారు, నేను convenor అనుకుంటారు. నేను co-ordinator అనుకుంటారు. ఈనాడు certificates ఆడవారికి ఎన్ని వచ్చాయి, మగవారికి ఎన్ని వచ్చాయి? ఆడవారంతా అధ్యాపకులుగా ఉండటం చేత యింత అభివృద్ధి అవుతున్నాది. మీరు కూడా అందులో పాల్గొని, ఆవిధమైన మార్గములో అభివృద్ధి చేసి తగిన ఉత్సాహప్రోత్సాహముల నందించాలి. కొంతమంది చెబుతారు 'స్వామీ! మాకు టైముండదు, ఆఫీసుకు పోతాము, యింకా ఎన్నో పనులంతా మాకుంటాయి ఈవిధంగా పిల్లలకు బోధ చేయటానికి మాకు ఎక్కడ టైము చిక్కుతుంది అని. కానీ అన్నింటికి టైము ఉంటుంది. ఆఫీసునుండి వస్తూనే ఏమి చేస్తున్నావు నీవు? ఏదో ఇంత కాఫీ టిఫిన్ తీసుకొని పిల్లలకు బోధించటానికి ప్రయత్నం చేయకూడదా, టి.వి. చూస్తు కూర్చుంటావు. రేడియో వేసుకొని కూర్చుంటావు. న్యూస్ పేపరు చదువుతూ కూర్చుంటావు. లేక క్లబ్బుకు పోయి కూర్చుంటావు. దీనికంతా టైము ఎక్కడ చిక్కుతున్నది నీకు? ఆడవారు కూడా యీ విధంగా చేయాలంటే వారు ఎందుకు చేయకూడదు? కాని వారు చేయటం లేదు. ఆ పిల్లల కోసం రాత్రింబవలు చాలా కష్టపడుతున్నారు ఆడవారు. ఆడవారి యందున్న శ్రద్ధాభక్తులు పురుషులందు కూడా వచ్చాయంటే ఎంతైనా ప్రపంచాన్ని మార్పు చేయవచ్చు. ఒక చిన్న ఉదా: ప్రశాంతినిలయాన్నే ఆధారంగా తీసుకోండి మీరు. ప్రైమరీస్కూలు ఉంటున్నాది. హయ్యర్ సెకండరీ స్కూలు ఉన్నాది. మన institute ఉన్నాది. కానీ ఈ higher secondary లోని పిల్లలకు, ప్రైమరీ స్కూలులో పిల్లలకు ఎంతనో వ్యత్యాస మున్నాది. కారణం? ప్రైమరీ స్కూలులో అందరు ఆడవారే టీచ్ చేస్తారు. టీచర్సు మాతృభావంతో చేస్తారు టీచింగ్. తమ బిడ్డలుగా భావించి బుజ్జగించి, ప్రేమించి, లాలించి వారికి బోధిస్తుంటారు. కానీ ఈ మగవారు తండ్రివలె జబర్దస్తి చేస్తూ కఠినంగా చెబుతూ వారికి తగిన శిక్షణ యిస్తుంటారు. ప్రేమ స్వరూపంగా బోధనలు మారినప్పుడే education in human values పెరిగి పోతుంది.

**బోధన మృదు మధురంగా ఉండాలి**

విద్యను బోధించే విధానంలో చాలా మార్పు రావాలి.బోధన మృదువైనదిగా ఉంటుండాలి. మధురమైనదిగా ఉంటుండాలి. ప్రేమ సంబంధ మైనదిగా ఉండాలి. కానీ

sri sathyasai vachanamrutam

ఈవిధమైన ప్రేమ సంబంధము లేదు మగవారి యందు. గ్రంథ పరిచయము మాత్రమే చూచుకుంటూ పోతారు. కానీ స్త్రీలు అట్లాకాదు. హృదయ పరిచయాన్ని చూసుకుంటూ వస్తారు. పిల్లలలో ఎవరైనా కొంచెం అనారోగ్యంగా ఉంటే టీచర్సుగా ఉన్న స్త్రీలు వారి యింటికి పోయి ఆ పిల్లవాడు ఎట్లా ఉన్నాడని విచారిస్తారు. మా విద్యార్థికి జ్వరం వచ్చింది వాడు ఎట్లా ఉన్నాడో ఏమో అని వాని యింటికి నడచిపోయి పిల్లవాని క్షేమ సమాచారం విచారిస్తుంటారు. ఈ మగ టీచర్సు విద్యార్థి క్లాసుకు రాకపోయిన ఎక్కడకు పోయినాడని ప్రశ్నించరు. కనుక వీరికి ఉండిన ప్రేమతత్వం యింత మాత్రమే. మగవారి యందు కూడా ఈ ప్రేమతత్వం అభివృద్ధి కావాలి. అప్పుడే ఈ సర్వసమానత్వం మనకు ప్రాప్తిస్తుంది. మగవారి యందు అహంకారం అధికంగా ఉంటుంది. ఈ అహంకారమే మగవారి తత్వము చెడగొడతున్నది. నేను అధికారిని, నేను గొప్పవాడను, నేను యజమానుడను అనేది ఉంటున్నది. నీవు యింటికి యజమానుడవే నీవు అధికారివే ఎవ్వరు కాదని చెప్పలేదు. కానీ పిల్లవానికి బోధించే సమయంలో మృదుమధురంగా బోధించాలి.

ఈనాడు ప్రపంచము యిట్లా చెడిపోవటానికి మూలకారణం అధికారులే. ఈ అధికారము సరైన మార్గములో ఉపయోగించుకోటం లేదు. గొప్ప అధికారిగా ప్రమోషను వస్తుంది. అక్కడ ఈ అధికారి విచారించవలసిన human qualities ఎక్కడ? నేను యింత పెద్ద అధికారిగా ఉన్నాను. నాకు ఇంత జీతం వస్తున్నాది. ఈ జీవితానికి తగిన పని నేను చేస్తున్నానా లేదా అని తనకు తాను ప్రశ్న వేసుకోవాలి. గవర్నమెంటు నుంచి కావలసినంత salary తీసుకుంటున్నావు. గవర్నమెంటుకు అణుమాత్రమైనా పనిచేయటం లేదు. నీవు దేశానికే మోసం చేసినవాడవై పోతున్నావు. కానీ స్త్రీలు అట్లా చేయటం లేదు. తీసుకొనేది కొంచెమైనా పని ఎక్కువగా చేస్తున్నారు. ఎక్కడైనా మీరు విచారించండి. నేను అనేక పర్యాయములు అనేక ఫ్యాక్టరీసులో విచారించాను. బెంగుళూరులో telephone facility ఉంటున్నాది. ఆ factory లో అందరు ఆడవారే. ఆ chairman నా దగ్గరకు వచ్చినప్పుడు నేను ప్రశ్నించాను, "ఎందుకు మగపిల్లలను మీరు తీసుకోకూడదు" అని. అప్పుడు ఆయన 'స్వామీ! ఒక మగపిల్లవాడు చేసే పని ఏమాత్రం పనికి రాదు. ఒక్క ఆడబిడ్డ చేసేపని పదిమంది మగపిల్లలు కూడా చేయటం లేదు" అని సమాధానం చెప్పాడు. వారు ఏదైనా ఒక

sri sathyasaivahini.in

పట్టుదల పడితే దానిని సాధించటానికి పూనుకుంటారు. ఇంకా ఒక చిన్న విషయాన్ని మీరు కనిపెట్టండి. మగవారు car drive చేసుకొని పోతున్నారు. ఆడవారు car drive చేసుకుంటూ పోతున్నారు. కానీ accidents ఎక్కువగా మగవారు drive చేస్తున్నప్పుడే జరుగుతున్నాయి. ఆడవాళ్లు కార్లు ఎక్కువగా accidents కావటం లేదు. ఎందుకనగా వారి concentration అట్లా ఉంటున్నాది. కనుక ఈ విద్యా విధానమునందు ఆడవారికి ఏవిధమైన concentration ఉందో ఆవిధంగా మగవారికి కూడా రావాలి. ఆ concentration మగవారితో వచ్చినప్పుడు దేశం ఎంతైనా బాగుపడుతుంది. పరుల నిమిత్తమై మీరు విచారించనక్కర లేదు. సత్యసాయి సంస్థల విషయం మీరు జాగ్రత్తగా చూచుకోండి. మీరు ఏమంచి చేసినా అది సత్యసాయి పేరుకే వస్తుంది. ఏ చెడ్డచేసినా అది సత్యసాయి పేరుకే వస్తుంది. సత్యసాయి పేరుకు సత్యమైన మార్గము అనుసరిస్తూ రావాలి. మన యొక్క సంస్థలలో ఒకరికి ఒకరికి కలహములుంటున్నాయనే నింద కూడా రాకూడదు. సంస్థలో ఒకరికొకరు ఏమాత్రం భేదభావములు పెట్టుకోకూడదు. ఐకమత్యంతో మనం జీవించటానికి ప్రయత్నించాలి. అన్నింటికి ప్రేమయే ఆధారము. ప్రేమయే దైవము. ఆ ప్రేమ యందే జీవించటానికి ప్రయత్నం చేయండి. Love is God. Live in Love. ఆవిధంగా పోయినప్పుడే ఎంతైనా సాధించటానికి వీలవుతుంది.

### Information కాదు, transformation కావాలి

అమితంగా పనిచేస్తే యినుప మిషను కూడా చెడిపోతుంది. ఈ ప్రాణముతో కూడిన దేహానికి విశ్రాంతి అవసరమే. మీరు తీసుకోటం మంచిదే కానీ సాయి ఏ sunday అయినా holiday తీసుకుంటున్నాడా? No. Every day ప్రతిదినము, ప్రతిక్షణము నా కర్తవ్యము నేను నిర్వర్తిస్తూ వస్తున్నాను. ఇదియే కర్తవ్యం యోగముచ్యతే. కాబట్టి do your duty. Duty is God. ఈ రకమైన పదములను చక్కగా ఆచరణలో పెట్టినప్పుడు చక్కగా పని చేయవచ్చును. పెద్దలైన పిల్లలు మీరు ఆదర్శంగా నిలుస్తే చిన్న పిల్లలు మిమ్మల్ని అనుసరిస్తూ వస్తుంటారు. ఈనాటి పిల్లలు అనుసరించకుండా పోవటానికి పెద్దలే కారణం. తండ్రి కూర్చోటం, కుమారుని నడవమంటే ఎట్లా నడుస్తాడు? మొట్టమొదట నీవు నడు, నీవెంట వస్తుంటాడు పిల్లవాడు. మొట్టమొదట నీవు లీడరు కావాలి. లీడరు ముందుండి

sri sathyasai vachanamrutam

నడవాలి గానీ వెనుక నుండి నెట్టకూడదు. ఈనాటి పెద్దలందరు ఈ పవిత్రమైన మానవతా విలువలు అభివృద్ధి గావించటానికి తగిన కంకణం కట్టుకోవాలి. ఈ చైర్‌మెన్‌లు, సెక్రటరీలు, కోఆర్డినేటరు వీరందరు కర్మలో ప్రవేశించాలి. ఏదో వ్రాసి పదిమందికి పంచటం కాదు ముఖ్యము. ఈ circulation తో పని జరిగేది కాదు. లోపలనే circulation జరగాలి. అప్పుడే సరైన మార్పు కలుగుతుంది. అప్పుడే మనలో ఒకవిధమైన transformation వస్తుంది. లేకపోతే జీవితమంతా information లోనే సరిపోతున్నాది. Information ముఖ్యంకాదు, information కేవలం quantity. Transformation is quality ఎంతమందికి ఇచ్చాము డిగ్రీలు, ఎంతమంది కిచ్చాము ఈ certificates? ఇది కాదు మనం పంచు కోవలసినది. ఎంతమందిని బాగు చేశాము. ఎంత మందిని నేను బాగు చేశాను. ఎంతమందికి ఆదర్శంగా నేను నిల్చాను? ఈ సత్యాన్ని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి.

విదేశములలో చాలా గొప్పగా పని జరుగుతున్నదని నాకు తెలుసు. Human values అంటే ప్రాణసమానంగా చూస్తున్నారు పిల్లలు. తల్లిదండ్రులు మొట్టమొదట అంత యిష్టపడక పోయినప్పటికిని పిల్లల యొక్క మార్పు పురస్కరించుకొని వారు కూడా ఎంతో శ్రద్ధాభక్తులతో పంపుతున్నారు. దీనియందు టీచర్సు యొక్క interest చాలా ఎక్కువగా ఉంటున్నాది. టీచర్సులో ఆ interest అభివృద్ధి అయిందంటే ఎంతగానో అభివృద్ధి అవుతుంది human values. ఈనాడు human values, human values అనుకుంటున్నారే గానీ ఎంతవరకు అభివృద్ధి గావించారు ఈ ప్రశ్న వేసుకుంటే జీరో మార్కులు వస్తున్నాయి. కాదు కాదు నూటికి నూరు మార్కులు రావాలి. సరైన ప్రయత్నముతో పని చేసుకుంటూ రావాలి. Sincere work, honest work, disciplined work, devotional work, duty work గా రావాలి. మూడింటి ఏకత్వము ఇందులో ప్రవేశపెట్టాలి. కేవలం చెప్పటం, వారికి వినిపించటము యింత మాత్రమే కాదు. చాలామంది శ్రద్ధాభక్తులతో ఈ మానవతా విలువలలో పాల్గొంటున్నారు. అన్ని దేశములందు కూడాను మలేసియా, సింగపూరు, జపాను, జర్మని అన్ని దేశములలో ఆడవారు చాలా పనిచేస్తున్నారు. ఏ పరిస్థితి యందైనా స్వామి ఆజ్ఞ శిరసావహించి చేస్తున్నారు.

sri sathyasai vachanamrutam

ఒక చిన్న ఉదాహరణ మీకు చెబుతున్నాను. గొప్పతనం కోసం కాదు చెప్పటము. పోయినవారము మహిళా విభాగములో పనిచేసే ఒక వ్యక్తి యొక్క తల్లి అకస్మాత్తుగా మరణించింది. మరణించినదని విని వెళ్ళి చూచించి. రాత్రి అక్కడ ఉంది. తెల్లవారి లేస్తూనే పనికి రావాలి యిక్కడ. తెల్లవారి స్నానం చేసి వచ్చి duty లో చేరింది. నేను అడిగాను, "ఇంకా చిన్న వయస్సే. తల్లి మరణిస్తే నీవు ఎందుకు duty కి వచ్చావు" అని. దానికి ఆమె "స్వామీ! జనన మరణాలు సహజమైనవి. జననముతో పాటు మరణం కూడా సహజంగా ఉంటుంది. రెండు కూడా ఒకదానికొకటి జంట పక్షులే. ఏ మనిషికైనా జననము వచ్చినప్పుడు మరణం తప్పదు. ఇది జరగవలసింది జరిగిపోయింది కానీ నా duty నేను చేయాలి. ఎవరి duty? దైవము యొక్క duty. మిగిలినవన్నీ అనిత్యము, అశాశ్వతమైనవే. కానీ దైవము యొక్క పని శాశ్వతమైనవి. ఆ పనికోసం నేను వచ్చాను" అని చెప్పింది. ఆ విధముగా మందిరంలోనే ఉంటున్నవారు ఎంతోకాలం నుండి యిదే సేవ చేస్తుండేవారు. కానీ తల్లి మరణించినా మనస్సు భగవంతునిపై మరల్చుకొని దుఃఖములో కూడా భగవంతుని తలంచి తన duty తన కర్తవ్యము నిర్వర్తించింది. ఆమెనే nurse శౌరీ దగ్గర కూర్చుంటుంది ఆశా అనే అమ్మాయి. ఆమె భర్త శివ పండిట్. ఆయన లెక్చరర్‌గా ఉంటాడు. ఈవిధంగా sincere గా పనిచేసే వారు ఎన్నో కోట్లమంది ఉంటున్నారు లోకములో. వారు పేరుకోసం పాటు పడడం లేదు, ప్రతిష్ఠల కోసం పాటుపడడం లేదు, స్వామి యొక్క సేవకోసం పాటు పడుతున్నారు. స్వామి యొక్క దయకోసం పాటు పడుతున్నారు. ఆవిధమైన భావం ఏనాడు కలుగుతుందో అప్పుడే సరియైన బోధ జరిగినట్టు. కనుక ఒకటి రెండైనా ఆచరణలో పెడితే ఎంతైనా మనం సాధించిన వారమవుతాం. కనుక ఆనాటి నుండి నేటివరకు ఒక్కదినం లీవు తీసుకోలేదు duty is God. నా duty నేను చేయాలనే ప్రతిజ్ఞతో ఉంటున్నారు. ఆడవారు ఆవిధంగా దీక్ష కంకణం ధరించారు.

భగవంతుడు భగవద్గీతయందు మూడు విధములైన కంకణములు కట్టారు.

**"యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత**
**అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం"**

sri sathyasai vaharamrutam

అని మొదటి కంకణం. ఎక్కడ ధర్మం నశిస్తుందో అక్కడ నేను అవతరిస్తాను అన్నది మొదటిది. ఇంక రెండవది. ఏవిధమైన కష్టములు కల్గినా

**"నమే పార్థాస్తి కర్తవ్యం త్రిషులోకేషు కించన**
**నానవాప్తమ వాప్తవ్యం వర్తయేవచ కర్మణి"**

నేను ఎప్పుడు కర్మలాచరిస్తూనే ఉంటాను. నాకీ duty వల్ల వచ్చే లాభం ఏమీలేదు. ఈ లాభనిమిత్తమై కర్మలు ఆచరించటం లేదు. ఇది నా కర్తవ్యం కనుక నేను ఆచరిస్తున్నాను. ఈ విధంగా భగవంతుడు కూడా అనేక దీక్షలు బూని ఈ ప్రపంచంలో నిలుస్తున్నాడు. ఇక మూడవది

**"యత్ర యోగశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః**
**తత్ర శ్రీ విజయోర్భూతి ధ్రువా నీతిర్మతి ర్మమ"**

నేను ఎప్పుడూ అక్కడే ఉంటాను. అనగా దైవచింతన చేసే దాసుడు ఎక్కడుంటాడో, అక్కడ దైవము ఉంటాడు. ఎక్కడ దైవము, దాసుడు ఉంటారో, అక్కడంతా ప్రతిష్ఠగా మారిపోతుంది. సర్వ విజయములు అక్కడే కల్గుతూ ఉంటాయి. ఇది భగవంతుడు పట్టిన దీక్ష. భగవంతుడే ఈ విధమైన దీక్షను పెట్టుకున్నప్పుడు భక్తుడు ఎందుకు దీక్షను వహించకూడదు? ఇది నా యొక్క ప్రతిష్ఠ, ఇది నా యొక్క దీక్ష, నేను దీనిని అనుసరించే తీరాలని ఒక promise ను మనం చేసుకోవాలి.

సంపాయించిన ధనకనక వస్తువాహనాదులన్నీ గాలిమేడలవలె ఎగిరి పోతుంటాయి. Money comes and goes, morality comes and grows. మనం morality సంపాయించాలి. Money సంపాయించటం గొప్పతనము కాదు. ఒక begger బజార్లో ఉండి money సంపాయిస్తాడు. Money సంపాయించటం గొప్పతనమా? కాదుకాదు

**"కారే రాజులు రాజ్యముల్ కలుగరే**
**గర్వోన్నతిం బొందరే వారేరి**
**సిరిమూట కట్టుకొని పోవంజాలిరే"**

సంపాయించిన ధనము ఒక్క కాసైనా వెంట తీసుకొని పోవటం లేదు. కనుక,

sri sathyasai vachanamrutam

సంపాయించినది సమాజమునకు అర్పితము గావించాలి. సమాజ సేవలో పాల్గొనాలి. నేను ధనవంతుడనని అహంకారపడటం గొప్పతనం కాదు. త్యాగియే నిజమైన భోగి. ఈ ధనముతో భోగపడేవాడే నిజమైన రోగి. ఆవిధంగా రోగులు కాకూడదు, త్యాగులు కావాలి. కనుకనే వేదం చెప్పింది **"న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానసుః"** అని. ఎంతమంది ధనవంతులు లేరు? ఎంతమంది బీదలకు అన్నం పెడుతున్నారు? ఎంతమంది బీదలకు చదువు చెప్పిస్తున్నారు? త్యాగంతో కొంత వరకు కార్యానికి పూనుకోవాలి. మీమీ గ్రామములలో, మీమీ రాజ్యములలో, మీమీ స్టేట్సులో, మీమీ ప్రాంతములలో బీదలకు, ఆడవారికి సహాయం చేయాలి.

**జీతానికి తగినట్టుగా పనిచేయటమే దేశ సేవ**

సేవ అంటే ఏమిటి? బజార్లు ఊడ్చటం సేవకాదు. మందిరాలు ఊడ్చటం సేవ కాదు. నారాయణసేవ చేయటం సేవ కాదు. ఇంతమాత్రమే సేవకాదు. మన duty సక్రమంగా చేయాలి. మన duty తగిన రీతిగా చేయటం కూడా ఒక సేవయే. నీకు ఇచ్చే జీతానికి తగిన పనిచేస్తురా, అదీ సేవయే. వేలరూపాయల salary తీసుకుంటున్నావు, వందల రూపాయల పని చేయటం లేదు. సేవ అని ఎట్లా చెప్పగలం? కాదుకాదు. తీసుకున్నదానికి తగిన పనిచేయి నీవు. అదే దేశానికి సేవ. అదే దేశానికి నీవు చేసే నిజమైన సేవ. అదే సమాజమునకు నీవు చేసే సహాయం. సమాజమునకు సరైన సేవ చేయాలి. ఈ సమాజమునకు సేవ ఏవిధంగా చేయాలంటే అన్నం పెట్టటం కాదు సమాజసేవ. ప్రభుత్వానికి ఏవిధమైన పరిస్థితి యందు బాధలు రాకుండా చూచుకోవాలి. ధనము ఎక్కువగా యివ్వటం చేత ప్రభుత్వము యొక్క ఖజానాలో ధనము అయిపోతున్నది. తిరిగి నెలకు నీకు జీతం యివ్వాలంటే ఏమి చేస్తున్నారు? విదేశాల నుండి అప్పులు తీసుకువస్తున్నారు, జీతములు ఇవ్వడానికి.

దేశమును తాకట్టు పెట్టటం కాదు మనసేవ. దేశమును తాకట్టునుండి విడిపించాలి. పరాధీనం కాకుండా చూచుకోవాలి. ప్రజలకానందము నందించాలి. ఇదియే నిజమైన సేవ. సాయి సంస్థలలో చేరినవారు కండలు కరిగి, ఎముకలు అరిగే రీతిగా పనిచేయాలి. కండలు

srisathyasaivachanamrutam

కరిగేటట్టుగా పనిచేస్తే పన్నులు అరిగేటట్టు తినవచ్చు. కానీ నీవు మాత్రం పనిచేయకుండా తినటానికి ఎట్లా మనస్సు వస్తున్నది? కనుక మొట్టమొదట కష్టపడి పనిచేయి. శ్రమించు కష్టపడు. కడపటికి ఆనందంగా భుజించు. చక్కని ఆరోగ్యం కల్గుతుంది. ఆరోగ్యమైన దేహముతో ఎన్ని పనులైనా నీవు చేయగలవు.

**భగవంతుని యందు పరిపూర్ణమైన భక్తిని, అచంచలమైన విశ్వాసమును పెంచుకోవాలి**

ప్రేమస్వరూపులారా! మీరందరు ప్రేమను పెంచుకోండి. మీ ఆరోగ్యమును అభివృద్ధి చేసుకోండి. మీరు మంచిగా ఉంటుండి సమాజసేవలో పాల్గొనండి. సమాజసేవ చేయండి. అప్పుడే మీకు సరైన శక్తి సామర్థ్యములు దైవానుగ్రహము చేత కలుగుతూ ఉంటాయి. "మూకం కరోతి వాచాలం పంఘుం లంఘయతే గిరిమ్" మూగవానితో మాట్లాడిస్తాడు భగవంతుడు. కుంటివానిని కూడా కొండనెక్కిస్తాడు భగవంతుడు. నీవు కష్టపడి సేవ చేసినప్పుడు నిన్ను ఎందుకు ఉద్ధరించడు భగవంతుడు. ఈ మాత్రము నమ్మకము మీకు లేకుండా ఉందా? ఆ నమ్మకం చేత మీరు పనిచేస్తూ రావాలి. కానీ ఈనాడు అట్టి నమ్మకం చాలా తగ్గిపోయింది. కారణం ఏమిటి? మీ విశ్వాస దోషమే దీనికి మూలకారణం. విశ్వాసమును పెంచుకుంటూ రావాలి. ఆ విశ్వాసాన్ని పెంచుకుంటూ పోయినప్పుడే అన్ని విధములైన శక్తిని కూడా అనుగ్రహిస్తాడు భగవంతుడు. ఆ పరిపూర్ణమైన భక్తిని మీరు పెంచుకోవాలి. అచంచలమైన భావాన్ని మీరు పెంచుకోవాలి. Slow and steady wins the race. ఈ రెండింటి ద్వారా సమాజంలో విజయాన్ని సాధించవచ్చు. ఇవి మీరు ఇంకొకరితో చెప్పించుకో వలసినవి కాదు. మీ నుండియే ఆవిర్భవింపవలసినవి. కేవలం భక్తి భక్తి అని "రామా! కృష్ణా! గోవిందా!" అనుకుంటే చాలదు. ఇవన్నీ ప్రాకృతమైన సాధనలే. ఈ నామములన్నీ సత్కర్మలకు మాత్రమే సంబంధించినవి. ఈ సత్కర్మల వల్ల సద్భావములు రావచ్చును. కానీ మానసిక శాంతి కలగదు. మానసిక శాంతి రావాలంటే పరిపూర్ణమైన విశ్వాసముతో మీరు పనులలో ప్రవేశించాలి.

**మానసిక శాంతి కావాలంటే హృదయపూర్వకంగా, ప్రేమభావంతో సేవలో ప్రవేశించాలి**

ఈనాడు ప్రతిదానికి కావలసినది mental peace. మానసిక శాంతి లేక అనేకమంది

sri sathyasai vahini amrutam

అనేక అవస్థలకు గురౌతున్నారు. **మానసిక శాంతి కావాలంటే హృదయ పూర్వకంగా నా సోదరులకు, నా సోదరీమణులకు సేవ చేస్తున్నాను** అనే ప్రేమభావము చేత, **సంబంధ బాంధవ్యము చేత మీరు సేవలో ప్రవేశించాలి. ఏదో కొన్ని కొన్ని పరిస్థితుల యందు భేదాభిప్రాయములు కలిగినప్పటికి మరు నిముషమే దాన్ని మార్చుకోవాలి. ఆ ద్వేషాన్ని అట్లనే పెంచుకుంటూ పోకూడదు.** పాండవులే దీనికి ప్రధానమైన సాక్ష్యము. కృష్ణుడు ఒకనాడు, పాండవులు అరణ్యములో సంచరించే సమయంలో పర్ణశాలకు వెళ్లాడు. సోదరులు ఎవరూ అక్కడ లేరు. ధర్మజుడు ఒక్కడు మాత్రమే ఉంటున్నాడు. 'ధర్మరాజా! సోదరులెక్కడ' అని ప్రశ్నించాడు. అప్పుడు ధర్మరాజు చెబుతున్నాడు. ఎంత గొప్ప ఆదర్శము? 'కృష్ణా! నలుగురు ఆహారము తీసుకురావటానికి పోయినారు. నూరుమంది మాత్రం హస్తినాపురంలో ఉన్నారు' అన్నాడు. అప్పుడు కృష్ణుడు ధర్మజునితో నీకు బుద్ధి లేదా? ఆ నూరుమంది నీకు సోదరులు ఎట్లా అవుతారు? మీరు పంచ పాండవులు. వారందరు నీకు సోదరులు ఎట్లా అవుతారు? వారివలనే నీకు ఈ కష్టములంతా కలుగుతూ వచ్చాయి" అన్నాడు. దానికి ధర్మజుడు చెబుతున్నాడు. 'కృష్ణా! నీకు తెలియదా? మాలో మేము 105 మంది సోదరులము. కౌరవులు నూరుమంది, పాండవులు ఐదుమంది. మేము మొత్తం 105. మాలో మాకు భేదాభిప్రాయములు వస్తే మేము ఐదుమంది వేరు, వారు నూరుమంది వేరు. మా కుటుంబముపై ఎవరైనా వస్తే మేము 105 మంది కలిసి పనిచేస్తాము కాబట్టి కొంత భేదభావము కలిగినంత మాత్రమున సోదరులు కాకుండా పోరు. వారు కూడా నా సోదరులే". ఆవిధమైన భావాన్ని ఈనాడు పెంచుకుంటూ రావాలి. ఏదో ఒక విషయములో కొంత భేదము కల్గినంత మాత్రమున వారికి మీకు ఎడబాటు ఉండకూడదు. అందరూ సోదరులే. ఆ ఒక్క విషయంలో మనమిద్దరము ఏకము కాదు కానీ, మిగతా విషయాలలో ఏకమే అను ఐకమత్యాన్ని ఎప్పుడు పెంచుకోవాలి.

సాయిసంస్థలలో ఏవిధమైన కలహములు లేవు. ఏవిధమైన భేద భావములు లేవు. ఒక్క తల్లిబిడ్డల వలె జీవిస్తున్నారు. ఈ విధమైన ఆదర్శము ఏ సంస్థలలోను లేదనే సత్కీర్తిని మీరు తెండి. ఆ పేరు ఒక్కటే మనకు చాలు. ఆ పేరే ముఖ్యమైనది. మంచిపేరు తెచ్చుకుంటే గొప్పవారమై పోతాం. Bad name తెచ్చుకుంటే ఏమి గొప్ప వారమవుతాం? చెడ్డవారైతే



sri sathyasaivachanamrutam

అందరు చెడ్డవారుగా అయిపోతారు. మంచివారైతే ఒక్కడు మాత్రమే మంచి వాడౌతాడు. అందరు మంచివారు కావాలి. అందరు సాయి సంస్థలలో అన్నదమ్ముల వలె పెరగాలి. ఐకమత్యమును పెంచుకోండి. ప్రేమతత్వాన్ని కూడా అభివృద్ధి పరచుకోండి. సోదరత్వాన్ని మీరు పెంచుకోండి. కర్మ లోపల అందరు చేరి పని చేయండి. 5 వేళ్లున్నాయి. ఈ 5 వేళ్లు చేరితే గానీ ఒక పని చేయటానికి వీలుకాదు. ఒక్కొక్క వేలు విడిగా ఏమి పని చేయగలదు? ఎవరికి వారు నేను గొప్ప అనుకుంటారుట. నాకు ఇంకొకరు చెప్పేది ఏందుకు? నేనే ప్రెసిడెంటును, నేను చూచుకుంటాను అని అజ్ఞానంగా పోతుంటారు. అందువల్లనే సంస్థలో యిన్ని మనస్పర్థలు, కష్టనష్టములు జరుగుతుంటాయి. మన సాయిసంస్థలో అటువంటి భేదభావములు లేవు, నాకు తెలుసు. కానీ మీకు హెచ్చరిక చేస్తున్నాను. 5 వేళ్లున్నాయి. ఒకానొక సమయంలో ఐదూ పోట్లాడుకున్నాయట. అప్పుడు నేనే గొప్ప అని చిటికిన వేలు చెప్పింది. ఎట్లా నీవు గొప్ప అని నాలుగు అడిగాయి. అప్పుడు చిన్న వేలు చెప్పిందట ఎవరికైనా బుద్ధి చెప్పాలంటే మొట్టమొదట సైన్యాధిపతిగా నేనే పోతున్నాను. బుద్ధి లేదురా అంటే నేనే ముందుంటాను. కాబట్టి నేను చిన్న అయినా యితరులకు బుద్ధి నేర్పటంలో సైన్యాధిపతిగా ముందు నిలుస్తాను. రెండవది చెప్పింది నేనే చాలా గొప్ప అని. మిగిలినవి నవ్వినాయి ఎందుకోసం గొప్ప అంటున్నావు. ఈ వేలు చెప్పింది. 'నేను రాజును వజ్రవైఢూర్య గోమేధిక పుష్యరాగాలంతా మొట్టమొదట నా వేలుకే పెడతారు గానీ నీకు పెట్టరు కనుక నేనే గొప్ప' అనిందట. తన గొప్పతనం తాను చెప్పుకుంది. మూడవది లేదు నేను గొప్ప అందిట. 'పిచ్చివారా గవర్నరు పోతుంటే యిటువైపు అటువైపు బాడీగార్డులు పోతుంటారు. కాబట్టి నేను అందరిని పెద్దవాడను. నేను గవర్నరును. మీరిద్దరు ఈ ప్రక్కన ఆ ప్రక్కన బాడీగార్డులు. కాబట్టి నేను గొప్ప అధికారిని అనిందట. చూపుడు వేలు చెప్పింది నేను గొప్ప అని. ఈ నాలుగు వేళ్లు ప్రశ్నించాయట. ఎట్లా నీవు గొప్ప అని. అప్పుడు చూపుడువేలు చెప్పింది. వీడు మంచి, వీడు చెడ్డ, వీడు హింస పెట్టాడు, వీడు ఆనంద పెట్టాడు అని వేలు చూపి చెబుతున్నాను. నేను చూపకపోతే ఎవ్వరు తెలుసుకోలేరు అనింది. Point చేసేది నేను కాబట్టి నేను గొప్ప అన్నది. ఇక బొటనవేలు చెప్పిందట నేనే గొప్ప అని. ఎట్లా గొప్ప అని ఈ నాలుగు అడిగేటప్పటికి నేను లేకపోతే మీరు ఏ పని చేయలేరు కాబట్టి

sri sathyasai vahamrutam

నేనే గొప్ప అనింది. ఏ వ్రేలుకి అదే గొప్ప. నిజమే. అయినప్పటికి అన్ని వ్రేళ్లు చేరితేనే పని సరిగా అవుతుంది. ప్రెసిడెంటు గొప్పవాడే, సెక్రటరీ గొప్పవాడే, కో-ఆర్డినేటరు గొప్పవాడే, మెంబరు గొప్పవాడే, అందరు గొప్పవారే. ఎవరి పనికి వారు గొప్పవారే. కానీ, ఆ పని మనం విజయ వంతం చేయాలంటే 5 మంది చేరవలసిందే. సాయి సమితి, సాయి సేవాదళము, సాయి టీచర్సు, సాయి బాలవికాస్ అందరు చేరినప్పుడే ఏకత్వము వస్తుంది. కాబట్టి సాయి సంస్థలలో నున్నవారు ఒక్క చేయిగా భావించు కోవాలి. Fingers వేరు వేరుగా ఉన్నాయి గానీ కలసి పని చేస్తున్నాయి. కనుక ఐకమత్యము చాలా అవసరము.

**ప్రాచీన కాలమునుండి కలసి మెలసి పెరిగే తత్త్వము ఉండుటచేతనే, భారత దేశము పుణ్యభూమిగా, త్యాగభూమిగా, యోగభూమిగా మారిపోయింది:**

ఐకమత్యముంటే ఎంతటి పనైనా సాధించవచ్చును. ఐకమత్యము లేకుండా ఏమీ చేయలేము మనము. ఒక్కడే ఒక రెండు మైళ్లు నడుస్తూ పోతున్నాడంటే ఒక మైలు దూరము పోయేటప్పటికి కాలునొప్పి వస్తుంది. పది మంది చేరి వెడుతుంటే వీనికి ఏమాత్రం నొప్పి రాదు. ఎందుకంటే నాతోటి 9 మంది ఉంటున్నారనే ధైర్యమే వీనికి ఉత్సాహాన్ని ఇస్తుంది. కనుక మనం అంతా ఏకంగా చేరినప్పుడు ఎంత పనైనా చేయవచ్చును. అవన్నీ విజయవంత మవుతాయి. ఏ ఒక్కటి అపజయం కాదు. ఆవిధంగా కలసిమెలసి పని చేయండి.

**"కలసిమెలసి పెరుగుదాం-కలసిమెలసి తిరుగుదాం**
**కలసిమెలసి తెలుసుకున్న తెలివిని పోషించుదాం**
**కలసి మెలసి కలత లేక చెలిమితో జీవించుదాం."**

దీనినే వేదమందు **"సహనావవతు**
**సహనౌ భునక్తు**
**సహవీర్యం కరవావహై**
**తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై**
**ఓం శాంతిః శాంతిః శాంతిః"** అన్నారు.

sri sathyasaivachanamrutam

మొట్టమొదట వేదమందు మనమంతా కలసి మెలసి ఉండాలని చెప్పింది. ఈవిధంగా ప్రాచీనకాలం నుండి రావటంచేతనే భారతదేశము యింత పవిత్ర దేశముగా, ఇంత పుణ్యభూమిగా, త్యాగభూమిగా, యోగభూమిగా ఉండింది. అన్ని దేశములందు ఈ spirituality ఉన్నాది. కేవలం భారతదేశమే గొప్ప అని కాదు. కానీ సర్వత్రా ఉన్న దానిని యిక్కడ మాత్రమే ఆవిర్భవింపచేసుకున్నారు.

**భక్తుల హృదయాలే స్వామి నివాస స్థలము**

భూమికి ఎక్కడచూచినా ఆకర్షణ శక్తి ఉంటున్నది. కానీ ఆ gravitation ను న్యూటన్ ఒక్కడు మాత్రమే కనిపెట్టాడు. వాడు కనిపెట్టిన దగ్గర మాత్రమే ఈ gravitation ఉందా? అన్ని దేశములందు ఉంటున్నాది. కానీ, కనిపెట్టిన వాడు అక్కడున్నాడు. అట్లనే ఈ ఆధ్యాత్మిక తత్వము ఆవిర్భవింపచేసింది ఒక్క భారతదేశములోనే. అయితే ఆధ్యాత్మిక శక్తి సర్వత్రా ఉంటున్నది. అది లేకపోతే మీరంతా ఎందుకు వస్తారు? మీయందు కూడా ఉంటున్నది. మీయందు ఉండటం చేతనే యిక్కడ ప్రవేశించారు. ప్రేమస్వరూపులారా! ముఖ్యంగా మీరు అనుకున్న ప్లాను, మీరనుకున్న ఆశయాలు పరిపూర్ణం కావాలనుకుంటే ఐకమత్యంగా పనిచేయండి. డా॥గోల్డ్‌స్టీన్, జుమ్ సాయి ఎంతో ప్రేమతో చెప్పారు. నూతనమైన స్కూల్సులో విద్యాభ్యాసము అభివృద్ధి గావించాలి, బాలవికాస్ children కు సరైన బోధలు జరగాలని వారు ఆశించారు. ప్రైమరీ స్కూలు నుండి కాలేజి వరకు పోవాలన్నారు. చాలా ఆనందము. ఈవిధముగా జరిగినప్పుడే ప్రపంచమంతా ఎంతో శాంతిని పొందుతుంది. కాబట్టి అంత గొప్ప పని చేయాలనుకుంటే మొదటి నుండి ఐకమత్యంతో పని చేస్తూ రావాలి. మీరందరు ఐకమత్యంగా చేరితే ఏ పనైనా క్షణములో జరిగిపోతుంది. నేను ఎప్పుడు మీ వెంటనే, జంటనే, ఇంటనే ఉంటాను. మీరందరు ఐకమత్యంతో పనిచేయండి. నాకు ఒక్క ప్రశాంతి నిలయం, ఒక్క ఇండియా మాత్రమే కాదు. మీరు ఎక్కడున్నారో అక్కడే నేను కూడా ఉన్నాను. నా seat యిక్కడ కాదు. నా స్థానం నీ హృదయమే. కనుక మీరు ఎక్కడుంటే అక్కడ కూడా స్వామి ఉంటున్నారు. ఏ కొరతలు మీకు జరగవు. ఏవిధమైన అపజయములు మీకు జరగవు. పరిపూర్ణమైన విశ్వాసముతో మీరు పని ప్రారంభించండి. ఆ పరిపూర్ణ ప్రేమ మీరు పెంచుకోండి. తప్పక దిగ్విజయము

సాధించి వారు కోరినట్లుగా యావత్ప్రపంచ మంతా సత్యసాయి సంస్థలుగా రూపొంది అందరియందు సత్యసాయి తత్త్వము హృదయంలో ప్రతిష్ఠింపబడుతుంది.

**సమిష్టి భజనలు మాత్రమే కాదు, సమిష్టి సేవలు కూడా చేయాలి**

ఎవరికోసం చేసేది? ప్రజలకోసమే, ప్రపంచము కోసమే. మన శాంతి కోసం మనం చేసుకుంటున్నాము. ఇంటిలో వంట ఎవరికోసం చేస్తున్నాం. మనం భుజించేకోసం చేసుకుంటున్నాం. కాబట్టి ఈనాడు ఏ సేవచేసినా ఎవరికో చేస్తున్నామనే భావము మరిచి మాకు మేమే చేసుకుంటున్నామనే ఏకాత్మభావం పెంచుకోవాలి. ఈవిధమైన ఏకాత్మభావాన్ని పెంచుకున్నప్పుడు "ఏకం సత్ విప్రాః బహుధా వదంతి" అన్నట్లు అప్పుడే సమత్వం ఏర్పడుతుంది. దీనికి స్వామి పర్మిషన్ ఉండనక్కరలేదు. వారు ఆశించినదంతా నేను తథాస్తు తథాస్తు అని ఆశీర్వదిస్తుంటాను.

(శ్రీవారు చెప్పిన భజన పాటను భక్తులందరు ఏక కంఠంతో వంత పాడినారు. అనంతరం స్వామి తమ దివ్య సందేశమును కొనసాగిస్తు...)

ప్రేమస్వరూపులారా! స్వామి యొక్క ఆదేశానుసారంగా స్వామి యొక్క సంకల్పానుసారంగా స్వామి చెప్పిన పాటను మీరందరు ఏవిధంగా ఏక కంఠంతో పాడారో అదే విధంగా సేవలందు కూడా మీరు అందరు ఏక హృదయులై సేవలో పాల్గొనాలని నేను ఆశిస్తున్నాను. సమిష్టి భజనలు మాత్రమే కాదు సమిష్టి సేవలు కూడా చేయాలి. అప్పుడే మనకానందము కలుగుతుంది. అదియే నిజమైన భజన. అందరు ఏకంగా చేరి ఆనందంగా ఏకాత్మభావంచేత ఏకదైవంగా మీరు విశ్వసించి పనులు చేసుకుంటూ సరైన సమాజ సేవ చేయాలని ఆశిస్తున్నాను.

**(తేదీ 20-11-1998న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam